ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

ఆదివారం 3 నవంబరు 2024



ఒకే స్ట్రెచర్‌పై ఇద్దరు రోగులను కూర్చోబెట్టుకొని తీసుకెళుతున్న ఎంఎన్‌ఓ, బంధువులు

హ్యావ్ ఎ సేఫ్ జర్నీ..!



మాటలు చెబితే మార్పు రాదు. చేతల్లో చూపించాలి. ఎన్ని ప్రభుత్వాలు మారినా అనంతపురం పెద్దాసుపత్రిలో మాత్రం మార్పు రావడం లేదు. ఇక్కడికి ఉమ్మడి జిల్లా సహా వేర్వేరు ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది వైద్యం కోసం వస్తుంటారు. కానీ మౌలిక వసతులు లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోగుల కష్టాలను తెలిపే ఫొటో ఇది..! ఆర్థో వార్డులో అడ్మిట్ అయిన వీరిద్దరికీ ప్రమాదంలో కాళ్లు విరిగాయి. వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. టూ-డి ఎకో స్కానింగ్ చేయించుకోవాలని సూచించారు. దీంతో వార్డు నుంచి స్కానింగ్ సెంటర్ వరకూ ఇద్దరినీ ఇలా ఒకే స్ట్రెచర్‌పై తీసుకువెళ్లారు. స్కానింగ్ పూర్తయ్యాక తిరుగు ప్రయాణంలోనూ అదే స్ట్రెచర్‌పై సర్దుకున్నారు. ఈ ప్రయాణ సమయంలో వారి వాహనం అదుపుతప్పితే.. అదనంగా మరికొన్ని శస్త్ర చికిత్సలో, చికిత్సలో చేయించుకోవాల్సిందే..! పెద్దాసుపత్రి అత్యవసర విభాగంలో మంచానికి ఇద్దరు, ముగ్గురు, నలుగురు రోగులను నిత్యం చూస్తూనే ఉంటాం. వీల్ ఛైర్లు, స్ట్రెచర్ల కొరత, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓల కొరత కారణంగా రోగుల బంధువులే మోసుకువెళ్లడాన్నీ చూస్తుంటాం. పత్రికల్లో వార్తలు వస్తుంటాయి. పాఠకులు చదివి నిట్టూర్చడం మినహా.. ఎన్నడూ మారింది లేదు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

నువ్వు వద్దమ్మా..!

అర్ధరాత్రి నడివీధిలో కన్నతల్లి

కొడుకు వదిలేశాడు.. కూతురూ వద్దంది..!

కడుపులో బిడ్డ పడింది మొదలు అమ్మకు కష్టాలు మొదలౌతాయి. కానీ, అమ్మను కాబోతున్నానన్న ఆనందంతో ఆమె అన్నింటినీ భరిస్తుంది. ప్రేమగా పెంచి పెద్ద చేస్తుంది. కంటికి రెప్పలా కాపాడుకుంటుంది. కానీ రెక్కలు రాగానే అమ్మ భారమైపోతోంది చాలా మందికి..! తిరుపతమ్మ పరిస్థితీ అలాగే తయారైంది. మంచం పట్టిన కన్నతల్లిని.. ఊరుగాని ఊరిలో, నడివీధిలో అర్ధరాత్రి వదిలిపెట్టి వచ్చాడు కన్న కొడుకు. అక్కడికి సమీపంలోనే ఉన్న కూతురు, అల్లుడు కూడా ఆమెను ఇంట్లోకి రానివ్వలేదు. ఇంతకంటే దౌర్భాగ్యం ఏముంటుంది..?

మెయిన్‌లో



పత్తికొండలోని ఓ వీధిలో కూర్చున్న తిరుపతమ్మ

బాణసంచాలో బూచోడు..!

- పర్యావరణహిత పండుగలో చొరబాటు
- దీపావళి తరువాత పెరిగిన కాలుష్యం
- ప్రజల ఆరోగ్యంపై చెడు ప్రభావం
- చైతన్యం పెరగాలంటున్న నిపుణులు

దీపావళి పండుగ సందర్భంగా.. గురువారం బడికి సెలవు. కానీ శుక్రవారం కూడా చాలామంది చిన్నారులు బడికి వెళ్లలేదు. 'పండుగ మరుసటి రోజు మామూలే కదా..' అనుకోవచ్చు. కానీ, ఇంకో కారణం ఉంది. అదే.. జలుబు..! పండుగ రోజు కాల్చిన టపాసులు, చిచ్చు బుడ్లు తదితరాల వల్ల వచ్చే పొగను పీల్చి.. చిన్నారుల ముక్కులు కారుతుంటాయి. కొందరికి ముక్కు దిబ్బడ కూడా వచ్చి ఉంటుంది. కాస్త దగ్గు కూడా జమ అయ్యుంటుంది. బడికి పంపితే ఇబ్బంది కాబట్టి.. ఈ ఒక్కరోజు, కుదిరితే శనివారం కూడా ఇంటిపట్టునే ఉండిపోయారు. పర్యావరణ హితంగా జరిగే పండుగల్లో రసాయనాల చొరబాటే దీనికి కారణం. దీపావళిని తరతరాలుగా నిర్వహించుకుంటున్నాం. కానీ ఇటీవలే సమస్యలు తలెత్తడానికి కొందరు వ్యాపారుల లాభాపేక్షే కారణం. ప్రమాదకర రసాయనాలతో తయారయ్యే బాణసంచావల్ల వాయు, శబ్ద కాలుష్యం పెరిగి.. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోంది.



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలలో మట్టి ప్రమిదల వినియోగం నేటికీ కొనసాగుతోంది. ఇది శుభ పరిణామం. కానీ బాణ సంచాలో మార్పు వచ్చింది. గతంలో సురేకారం, గంధకం, సున్నం, ఆముదం తదితరాలను వినియోగించి ఇంట్లోనే మతాబులు, చిచ్చుబుడ్లు, అవ్వాయ్ సువ్వాయ్‌లు, సిసింద్రీలు, తాటాకు టపాకాయలు తయారు చేసుకునేవారు. వీటివల్ల పెద్దగా కాలుష్యం అయ్యేది కాదు. ఇప్పుడు ప్రమాదకర రసాయనాలతో బాణ సంచాను తయారు చేస్తున్నారు. భూమి, ఆకాశం దద్దరిల్లేలా బాణ సంచా పేలుస్తున్నారు. భారీ శబ్దాలతో హృద్రోగులు ప్రాణాపాయాన్ని ఎదుర్కొంటున్నారు. వాయు కాలుష్యంతో శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పశు పక్ష్యాదులు ఎదుర్కొనే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. పర్యావరణ పరిరక్షణ చట్టం-2006 ప్రకారం బాణ సంచా పేల్చే పాయింట్ నుంచి నాలుగు మీటర్లలోపు శబ్దం 125 డెసిబుల్స్‌కు మించరాదు. కానీ ఈ నిబంధన అమలు కావడం లేదు.

శబ్దం కాస్త తగ్గింది..

బాణ సంచా ధరలు భారీగా పెరిగిన కారణంగానో, కొందరిలో అవగాహన పెరిగిన కారణంగానో ఈ ఏడాది దీపావళి టపాసుల మోత కాస్త తగ్గింది. ఆ మేరకు శబ్ద కాలుష్యం కూడా తగ్గింది. గత ఏడాది దీపావళి టపాసుల వల్ల శబ్ద కాలుష్యం 81.5 డెసిబుల్స్‌గా ఉంది. ఈ ఏడాది 80.3 డెసిబుల్స్‌కి తగ్గింది. కమలానగర్‌లో గత 86.7 డెసిబుల్స్ నమోదు కాగా.. ఈ ఏడాదిలో 86.9కి చేరి.. కాస్త పెరిగింది. రామ్‌నగర్‌లో గతేడాది 81.6 డెసిబుల్స్, ఈ ఏడాది దీపావళి 82.5 డెసిబిల్స్ నమోదైంది. శారదా నగర్‌లో గత ఏడాది 76.2 డెసిబుల్స్ కాగా.. ఈ దీపావళికి 71.6 డెసిబుల్స్‌కి తగ్గడం విశేషం.



బాణసంచా కాలుస్తున్న సందర్భంలో వాయుకాలుష్యం

గాలి దెబ్బతింది..

దీపావళి తరువాత జిల్లాలో వాయు కాలుష్యం పెరిగింది. సాధారణ పరిస్థితుల్లో గాలి నాణ్యత సూచిక 100 ఉండాలి. అనంతపురం నగరంలో అక్టోబరు 24న ఈ సూచిక 67 ఉండగా.. దీపావళి రోజున 126కు పెరిగింది. సల్ఫర్ డయాక్సైడ్ సాధారణ పరిస్థితుల్లో 6 మీటర్ క్యూబిక్‌గా ఉంటుంది. బాణసంచా కాల్చడంతో 15.4కు పెరిగింది. నైట్రోజన్ ఆక్సైడ్ సాధారణ పరిస్థితుల్లో 16 మీటర్ క్యూబిక్‌గా ఉంటుంది. దీపావళి తరువాత 29.4కు పెరిగింది.

టపాసుల వల్ల వచ్చే కాలుష్యంతో గుండెతో పాటు

అవయవాలు దెబ్బతింటాయి..



ఇతర శరీర అవయవాలపై చెడు ప్రభావం పడుతుంది. దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. దీనిపై ప్రజలలో అవగాహన, చైతన్యం పెరగాలి. ప్రభుత్వ సూచనలను తప్పక పాటించాలి.

- డాక్టర్ గరుగు బాలాజీ, మానసిక వైద్యనిపుణులు

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి..



దీపావళి పండుగను కుల మతాలకు అతీతంగా జరుపుకుంటారు. భారతీయ సంస్కృతిలో పండుగలు ఒక భాగం. కుటుంబ సౌఖ్యాన్ని ఆకాంక్షిస్తూ జరుపుకుంటాం. అలాంటి వాటిలో దీపావళిది ప్రత్యేక స్థానం. మేము ముస్లింలమే అయినా.. దీపావళిని చాలా సంతోషంగా, ఘనంగా జరుపుకున్నాం. దీపావళికి టపాసులు కాల్చడం ఆనందంగా ఉంటుంది. కానీ మన ఆర్యోగం గురించి కూడా ఆలోచించాలి. బాణ సంచా కారణంగా వాతావరణంలో వచ్చే మార్పులు మన ఆరోగ్యం, మన జీవనంపై ప్రభావం చూపుతాయి.

- షేక్ చాందిని, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధి

బేరియం రహిత టపాసులు వాడాలి..



కాలుష్య నియంత్రణకు, ప్రజల ఆరోగ్య రక్షణకు బేరియం రహిత టపాసులను కాల్చాలి. ప్రతి పండగను పర్యావరణ హితంగానే నిర్వహించుకునేలా పెద్దలు నిర్ణయించారు. దీపావళిని అలాగే జరుపుకోవాలి. శబ్ద, వాయు కాలుష్యానికి దూరంగా ఉంచాలి. లేదంటే గుండె, ఊపిరితిత్తుల జబ్బులతో బాధపడేవారు ఇబ్బందులు ఎదుర్కొంటారు. బాణసంచా వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ వేయరాదు.

- బీవై మునిప్రసాద్, ఈఈ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు

వారం వరకు ప్రభావం..



బాణసంచా పేల్చడం కారణంగా శ్వాసకోశ సమస్యలు పెరుగుతాయి. ఈ కాలుష్య ప్రభావం గాలిలో సుమారు వారం రోజులు ఉంటుంది. కాబట్టి ఊపిరితిత్తుల సమస్య ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి. రాత్రి, తెల్లవారుజామున చలిలో బయట తిరగరాదు. కొవిడ్ బాధితులు కూడా జాగ్రత్తలు పాటించాలి. శబ్దం ఎక్కువగా రావడంతో కర్ణభేరి దెబ్బతినే ప్రమాదముంది. గుండెపైనా ప్రభావం చూపుతుంది. రక్తపోటు పెరిగి పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. చిన్నారుల ఆరోగ్యం పట్ల ఈ వారం రోజులు తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచాలి. శ్వాసకోశ వ్యాధులు ఉంటే.. మందులను కొనసాగించాలి. ఇన్‌హేలర్ వాడే వాళ్ళు యధావిధిగా వాడాలి.

- డాక్టర్ అజయ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్

కర్పూరం ఫ్యాక్టరీ కార్మికులు సేఫ్

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



కర్పూరం ఫ్యాక్టరీలో అస్వస్థతకు గురైన ఆరుగురు ఆరోగ్యంగా ఉన్నారని, వారికి ప్రాణహాని లేదని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీ రియాక్టర్‌ను మరమ్మతు చేసే సమయంలో అస్వస్థతకు గురైన కార్మికులను అనంతపురం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారని తెలిపారు. బాధితుల్లో ఒకరి పరిస్థితి మధ్యాహ్నానికే కుదుట పడటంతో డిశ్చార్జి అయ్యారని తెలిపారు. నాగేంద్రప్రసాద్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సారయ్య, హరినాథ్ బాబు ఇంకా చికిత్స పొందుతున్నారని తెలిపారు. వీరిలో ముగ్గురి పరిస్థితి మెరుగుపడిందని, సాధారణ వార్డుకు తరలించారని అన్నారు. మిగిలినవారి పరిస్థితి కూడా బాగా మెరుగవుతోందని అన్నారు. ఈ ఘటనపై విచారణకు అధికారుల బృందాన్ని పంపామని, వారిచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

(వివరాలు 7లో..)

జిల్లా అంతటా కరువు

రైతులకు కేశవ్ న్యాయం చేయాలి

మాజీ మంత్రి సాకే శైలజానాథ్

6







బీటెక్ విద్యార్థిని అదృశ్యం



హిమ బిందు

అనంతపురం క్రైం, నవంబరు 2: నగరానికి చెందిన బీటెక్ విద్యార్థిని హిమబిందు అదృశ్యమైంది. పాపంపేటకు చెందిన ఆమె ఎస్ఆర్ఐటీలో బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటి నుంచి శుక్రవారం కాలేజీకి బస్సులో బయలుదేరింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో కాలేజీలో విచారించారు. కాలేజీకి హాజరు కాలేదని తెలుసుకుని తల్లిదండ్రులు అనంతపురం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు మరమ్మతులు ప్రారంభం

విడపనకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గడేకల్లు-ఆర్.కొట్టాల రోడ్డు పనులను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ శనివారం ప్రారంభించారు. గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు మరమ్మతు పనులను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించిందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 68 ఆర్ అండ్ బీ రోడ్ల మరమ్మతులకు రూ.19.17 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. జనవరి 15లోగా పనులను పూర్తి చేయించి, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేస్తామని అన్నారు. త్వరలోనే మరిన్ని నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, ఎస్ఈ హరిప్రసాద్, ఈఈ రాజ్‌గోపాల్, ప్రత్యేక అధికారి వెంకటేశులు పాల్గొన్నారు.



జెండా ఊపి పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్

వ్యాధులు రాకుండా చూడండి

- ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత

అనంతపురం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్లతో శనివారం ఆమె సమావేశం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, పంచాయతీ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడా మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలని ఆదేశించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని సూచించారు. సమావేశంలో డీఎంఓ డాక్టర్ ఓబులు, అసిస్టెంట్ డీఎంఓ డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



ఒకటో రోడ్డు శివాలయంలో భక్తుల రద్దీ



కార్తీక దీపాలను వెలిగిస్తున్న యువతి



ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వర స్వామి

దేదీప్య మాసం

కార్తీక మాసం మొదలైంది. శివాలయాల్లో భక్తుల సందడి పెరిగింది. మహిళలు శనివారం వేకువజామున, సాయంత్రం కార్తీక దీపాలను వెలిగించారు. పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఆలయాలను నిర్వాహకులు విద్యుద్దీపాలతో అలంకరించారు. అనంతపురం నగరంలోని మొదటి రోజు శివాలయం ఆవరణ భక్తులు వెలిగించిన దీపాలతో వెలుగులను పరుచుకుంది. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆకాశ దీపాన్ని వెలిగించి, కార్తీక మాస వేడుకలను ఆరంభించారు. శివకోటి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, పాతూరు విరూపాక్షేశ్వర దేవాలయం, బసవేశ్వరస్వామి ఆలయం, అశోక్ నగర్‌లోని హరిహర దేవాలయం, హెచ్చెల్సీ కాలనీ చాముండేశ్వరి ఆలయం, మంజునాథస్వామి దేవాలయం, ఆరో రోడ్డులోని అమృతలింగేశ్వర ఆలయం, అరవింద నగర్ సర్వేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్



ఇంజనీర్ బరితెగింపు..!

కాంట్రాక్టర్ కోసం బ్రోకర్ అవతారం

పనులు చేస్తే చుక్కలు చూపిస్తానంటూ బెదిరింపు

ఆందోళనలో టీడీపీ కార్యకర్తలు



అనంతపురం పీఆర్ సబ్ డివిజన్-2 కార్యాలయం

బుక్కరాయసముద్రం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా పనిచేయాల్సిన ఓ ఇంజనీర్ బరితెగించి బెదిరింపులకు దిగుతున్నాడు. ఆయన సామాజిక వర్గానికి చెందిన ఓ క్లాస్ వన్ కాంట్రాక్టర్ కోసం విధి నిర్వహణను పక్కన పెట్టి బ్రోకర్ అవతారమెత్తాడు. ఆ కాంట్రాక్టర్‌కు పనులు ఇప్పించి.. అందిన కాడికి దోచుకోవచ్చని పన్నాగం పన్నాడు. పంచాయతీరాజ్ శాఖలో ఇంత జరుగుతున్నా... ఉన్నతాధికారులు మౌనంగా ఉండిపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ పేరుతో సీసీ రోడ్లు మంజూరు చేయడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. శింగనమల నియోజకవర్గంలోని ఓ మండలంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ నిర్వాహకంతో తెలుగు తమ్ముళ్లు నిరాశకు గురవుతున్నారు. గ్రామాల్లో పనులు దక్కించుకున్న టీడీపీ కార్యకర్తలు, నాయకులపై ఆ ఇంజనీర్ పెత్తనం చేస్తున్నట్లు సమాచారం. 'మీకు వచ్చిన పనిని నేను చెప్పిన కాంట్రాక్టర్‌కు ఇవ్వాలి.. మీరే చేస్తే విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో విచారణ జరిపించి బిల్లులు రాకుండా చేస్తా..' అంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పనులు చేసేందుకు టీడీపీ నేతలు జంకుతున్నారు.

ఆందోళనలో టీడీపీ శ్రేణులు

అనంతపురం పీఆర్-2 సబ్‌డివిజన్ శింగనమల నియోజకవర్గంలో ఆ ఇంజనీర్ కాంట్రాక్టర్‌గా అవతారమెత్తాడు. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు పనులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడంతో టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారు. 'అంతా నేనే చూసుకుంటా.. ఎమ్మెల్యేతో కూడా నేనే మాట్లాడుకుంటా.. నేను ఎంతో కొంత కమీషన్ ఇప్పిస్తా' అంటూ పైరవీలు చేస్తున్నాడు. ఆ ఇంజనీర్ సామాజిక వర్గానికి చెందిన ఓ కాంట్రాక్టర్ కోసం ఇదంతా చేస్తున్నట్లు సమాచారం. నష్టమైనా, లాభమైనా తాము పనులు చేస్తే గ్రామాల్లో గౌరవం ఉంటుందని టీడీపీ నేతలు వాపోతున్నారు. బెదిరింపులతో పనులు చేయలేకపోతున్నామని నాయకులు అంటున్నారు. బుక్కరాయసముద్రం మండలానికి రూ. 4.40 కోట్లు, నార్పలకు రూ.3.42 కోట్లు, గార్లదిన్నెకు రూ.3.30 కోట్లు, శింగనమలకు రూ.2.70 కోట్లు, పుట్లూరుకు రూ. 2.20 కోట్లు, యల్లనూరు మండలానికి రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం నియోజకవర్గంలో పలు చోట్ల పల్లె పండుగ కింద పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఇంజనీర్ నిర్వాహకంతో ఆ మండలంలో సీసీ రోడ్ల పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

బెదిరింపులకు భయపడవద్దు

అనంతపురం పీఆర్-2 సబ్ డివిజన్ శింగనమల నియోజకవర్గంలో ఆరు మండలాల్లో ఏ అధికారి బెదిరించినా భయపడవద్దు. నిబంధనల మేరకు సీసీ రోడ్లు వేయవచ్చు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా క్వాలిటీతోనే రోడ్లు వేయిస్తాం. ఎవరన్నా ఇంజనీర్ బెదిరింపులకు దిగితే... మా దృష్టికి తీసుకు రండి. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

-అరుణ్‌కుమార్, డీఈ

అర కొర్ర



కోతకు వచ్చిన కొర్రపంట

- తగ్గిన కొర్రపంట దిగుబడి
- భారీగా పడిపోయిన ధర
- రెండు నెలల్లో రూ.ఐదు వేలు పతనం
- ఆందోళనలో రైతులు

ఏ పంట సాగు చేసినా రైతుకు మాత్రం ఆశించిన ఫలితం దక్కడం లేదు. వివిధ రకాల పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులు కొర్రసాగు చేస్తే అరకొర దిగుబడి రాగా, ధర భారీగా పడిపోయింది. కొర్రపంట సాగుకు పెట్టుబడి కూడా తక్కువగా ఉండటంతో ఏడాదికేడాది సాగుచేసే రైతుల సంఖ్య పెరుగుతోంది. అయితే ప్రస్తుతం కొర్రపంట దిగుబడి తగ్గడంతో పాటు ధర కూడా భారీగా తగ్గింది. దీంతో ఏమి చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో కొర్ర సాగు రైతులు ఉన్నారు.

- తాడిపత్రి, ఆంధ్రజ్యోతి

ఆరు వేల హెక్టార్లలో కొర్ర సాగు

పెట్టుబడి తక్కువగా ఉండటంతో రైతులు పెద్దఎత్తున కొర్రపంటను సాగుచేస్తున్నారు. ఈ ఏడాది తాడిపత్రి నియోజకవర్గంలో ఆరువేల హెక్టార్లలో కొర్రపంటను సాగుచేశారు. తాడిపత్రి మండలంలో 880హెక్టార్లు, పెద్దపప్పూరు 230హెక్టార్లు, యాడికి 1250హెక్టార్లు, పెద్దవడుగూరు 3470హెక్టార్లు, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరు 18హెక్టార్లు, పుట్లూరులో 226హెక్టార్లలో కొర్రను సాగు చేశారు. ఈ పంట సాగుచేసే సమయంలో ధర ఆశాజనకంగా ఉంది. పంట సాగు కాలం 2నెలల నుంచి 3నెలలు ఉంటుంది. ప్రస్తుతం పంట కోత సమయం వచ్చింది. కానీ ధర మాత్రం అమాంతం పడిపోయింది.



రోడ్డుమీద పంటను ఆరబెట్టిన దృశ్యం

ధర భారీ పతనం

కేవలం రెండునెలల వ్యవధిలోనే కొర్రపంట ధర భారీగా పతనమైంది. క్వింటాకు రూ.5వేలు తగ్గింది. గతేడాది క్వింటా రూ.7వేలు ధర పలికింది. దీంతో ఈ ఏడాది రైతులు కొర్రను భారీ స్థాయిలో సాగు చేశారు. గతేడాది ఎకరాకు 10క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చింది. ఈ ఏడాది జూన్, జూలైలో వర్షాలు రాకపోవడంతో పంట దిగుబడి కూడా తగ్గింది. ఎకరాకు ఐదు క్వింటాళ్ల నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ధర, దిగుబడి తగ్గడంతో కొర్ర సాగు చేసిన రైతులు గగ్గోలు పెడుతున్నారు. కోత కోసిన పంటను నిల్వ చేసుకోవడానికి వీలులేకపోవడంతో కొందరు రైతులు ఉన్న ధరకే విక్రయిస్తున్నారు. మరికొందరు ఇళ్లవద్ద, గోడౌన్‌లో నిల్వ చేసుకుంటున్నారు. ఏ పంట వేసినా చివరికి నష్టాలే మిగులుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏ పంట సాగుచేసినా నష్టాలే



ధర బాగుందని, పెట్టుబడి తక్కువ అని ఆరు ఎకరాల్లో కొర్రపంట సాగుచేశా. కానీ ప్రస్తుతం ధర పడిపోవడంతో లాభాలు ఆశించినంత స్థాయిలో లేవు. ఏ పంట సాగుచేసినా రైతులకు నష్టాలే తప్ప లాభాలు ఉండటం లేదు. పంట సాగుచేసే సమయంలో ఉన్న ధర కోత కోసే సమయంలో ఉంటేనే రైతులు బాగుపడతారు.

-రామాంజులరెడ్డి, బందార్లపల్లి గ్రామం

పెట్టుబడి తక్కువని సాగుచేశా



పెట్టుబడి తక్కువగా ఉంటుందని నేను మరో రైతుతో కలిసి తొమ్మిది ఎకరాలను కౌలుకు తీసుకొని కొర్రపంట సాగుచేశా. ఎకరాకు రూ.5వేలు కౌలు మొత్తం చెల్లించాను. ఎకరాకు పెట్టుబడి రూ.6వేల నుంచి 7వేల వరకు ఖర్చుచేశా. పంట కోతకు వచ్చేసరికి క్వింటా రూ.2వేలకు పడిపోవడంతో ఏమి చేయాలో అర్థంకావడం లేదు. దిగుబడి కూడా ఆశించిన స్థాయిలో లేదు.

- సుబ్రహ్మణ్యం, కౌలు రైతు గన్నెవారిపల్లికాలనీ

శైవక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు

అనంతపురం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలకు 300 బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అనంతపురం రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి శ్రీశైలం, మహానంది, పొలతల, లేపాక్షి, అరుణాచలం రూట్లకు ఆదివారం నుంచి బస్సులు నడుపుతామన్నారు. ప్రత్యేక బస్సు సర్వీసుల్లో ఎలాంటి అదనపు చార్జీలు ఉండవన్నారు. జిల్లాలో ఏదైనా ప్రాంతం లేదా గ్రామం నుంచి 50 మంది చొప్పున బ్యాచులవారీగా బయలుదేరినా వారికి వారి గ్రామానికే బస్సును పంపుతామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందన్నారు.

డిపోల వారీగా సర్వీసుల వివరాలిలా...





డిపో పేరు	శ్రీశైలం దర్శనం	త్రిలింగ దర్శనం మహానంది శ్రీశైలం ఓంకారం	త్రిలింగ దర్శనం బుగ్గ యాగంటి మహానంది	అరుణాచలం	లేపాక్షి	ఆలూరుకోన	పొలతల
అనంతపురం	24	8	12	6	10	5	5
గుత్తి	-	2	4	-	-	-	-
గుంతకల్లు	12	4	8	2	-	-	-
కళ్యాణదుర్గం	24	4	8	2	-	-	-
రాయదుర్గం	30	4	10	4	-	-	-
తాడిపత్రి	30	8	12	6	-	20	10
ఉరవకొండ	12	4	8	2	-	-	-

నెట్టికంటి ఆలయంలో హనుమద్దీక్షలు



హనుమద్దీక్షల సందర్భంగా ఆంజనేయుడికి పూజలు చేస్తున్న అర్చకులు



దీక్షలు స్వీకరించడానికి కసాపురం దేవస్థానానికి వచ్చిన భక్తులు

గుంతకల్లు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం పలువురు భక్తులు హనుమద్దీక్ష స్వీకరించి హనుమాన్ మాలాధారణ చేశారు. మాల ధరించే భక్తులు వేకువజామునే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో భక్తులకు మాలాధారణ చేసి దీక్షలను ప్రారంభింపజేశారు. దాదాపు 300 మంది భక్తులు మండల దీక్షలను స్వీకరించారు.

ఎదురుచూపు !

సబ్సిడీ విత్తన వేరుశనగ కోసం రైతుల నిరీక్షణ

రబీలో పంట సాగు చేయడానికి సిద్ధం



తనకల్లు వ్యవసాయ కార్యాలయం

తనకల్లు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీలో వేరుశనగ పంట సాగు చేయడానికి ప్రభుత్వం పంపిణీ చేసే సబ్సిడీ విత్తనం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే బోరుబావుల కింద పంట సాగు చేయడానికి భూములను సిద్ధం చేసుకున్నారు. వైసీపీ పాలనలో రబీలో రైతులకు సబ్సిడీ పై విత్తన వేరుశనగ ఇచ్చిందే లేదు. అయితే కూటమి ప్రభుత్వమైనా తమ బాధలు తెలుసుకుని సబ్సిడీపై విత్తన వేరుశనగ అందిస్తుందేమోనని రైతులు ఎదురు చూస్తున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిఏటా సబ్సిడీపై మండలంలో రైతులకు రెండువేల క్వింటాళ్లకు పైగా విత్తనకాయలు సరఫరా చేసేది. రబీలో రైతులు పండించిన వేరుశనగ కాయలను స్వచ్ఛంద సంస్థలు, రైతు సంఘాల ద్వారా నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయించేది. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైతు సంఘాల సమక్షంలో ప్రాసెసింగ్ చేసి, తిరిగి రైతులకు ఖరీఫ్‌లో పంపిణీ చేసేవారు. అలాంటి పరిస్థితిని వైసీపీ పాలనలో కొనసాగించలేదు. ఇప్పుడు మళ్లీ టీడీపీ నేతృత్వంలోనే రాష్ట్రంలో ప్రభుత్వం కొలువుదీరడంతో రబీ విత్తన వేరుశనగపై రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రబీలో విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

ఎదురుచూస్తున్నాం



రబీలో గత ఐదేళ్లుగా సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వంలో అయినా ఇస్తారేమోనని ఎదురు చూస్తున్నాం. నేను మూడు ఎకరాల్లో వేరుశనగ సాగుచేయడానికి సిద్ధంగా ఉన్నా. గత టీడీపీ పాలనలో ప్రభుత్వమే విత్తనకాయలు సరఫరా చేసేది. రైతులు పండించిన కాయలను ప్రభుత్వమే నేరుగా రైతు సంఘాల ద్వారా గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేసేది. ఆ పద్ధతే రైతులకు ఉపయోగకరంగా ఉండేది.

- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివాండ్లపల్లి

రైతులను ఆదుకోవాలి



కూటమి ప్రభుత్వం రబీలో రైతులకు విత్తన వేరుశనగను సబ్సిడీతో అందించి, ఆదుకోవాలి. వైసీపీ ఐదేళ్ల పాలనలో విత్తనవేరుశనగ ఇచ్చిన పాపాన పోలేదు. ధరలు గిట్టుబాటు కాకపోవడంతో రబీలో కూడా వేరుశనగ సాగు తగ్గిపోయింది. రబీలో విత్తన వేరుశనగ సరఫరా చేసి, రైతులనుంచి రైతు సంఘాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. తద్వారా రైతులకు గిట్టుబాటు ధర వస్తుంది.

- రమణ, రైతుసంఘం నాయకుడు, తనకల్లు

నాసిరకం విత్తనాలే ఉన్నాయి



ఈఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ దెబ్బతినింది. దీంతో రబీలో సాగు చేయడానికి మార్కెట్‌లో నాసిరకం విత్తనాలే అందుబాటులో ఉన్నాయి. ఈ విత్తనాలతో పంట సాగు చేస్తే రైతులు నష్టపోవాల్సిందే. ప్రభుత్వం సబ్సిడీతో మేలురకం విత్తనాలు కొనుగోలు చేసి రైతులకు అందించాలి.

- బాలాజీనాయక్, రైతు, బాబేనాయక్ తండా



ఆదేశాలు రాలేదు

ప్రభుత్వం నుంచి ఇంకా రబీ విత్తన వేరుశనగ కోసం ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే మండలాలవారీగా విత్తనకాయల అవసరం గురించి ప్రణాళికలను తయారు చేస్తాం. అనంతరం ప్రభుత్వానికి పంపుతాం.

- సత్యనారాయణ, ఏడీఏ, కదిరి

ఏడు మండలాలనే ప్రకటించడం తగదు

మాజీ మంత్రి సాకే శైలజానాథ్..



మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కరువుకు ఆలవాల మైన అనంతపురం జిల్లాలో ఏడు మండలాలను మాత్రమే కరువు ప్రాంతా లుగా ప్రకటించడం తగదని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరుకు పొంతన లేదన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులందరికీ న్యాయం జరిగేలా జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ చూపాలని కోరారు. కరువు, వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోకుండా ప్రజలను మభ్యపెడుతూ, గత ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పరిమితం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా దాడులు, దుర్మార్గాలు పెరిగిపోయాయన్నారు. దళితులను పట్టుకెళ్లి గుడిలో దేవుడి ఎదుట చిత్రహింసలు పెట్టినా పట్టించుకొనే నాథుడు కరువయ్యార న్నారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తామన్న మాట మరిచి, మరోసారి పెంచడానికి రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. గత ప్రభుత్వంలో అరిచే బ్యాచ్ మాత్రమే ఉండేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వాన్ని చూస్తుంటే కరిచే బ్యాచ్ కూడ ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వాసు, శర్మాస్, ఓబిరెడ్డి, పరమేశ్వర రెడ్డి నిశాంత్‌రెడ్డి, మురళీ పాల్గొన్నారు.

అవినీతి సొమ్మును రికవరీ చేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి సొమ్మును రికవరీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదల కోసం ఏర్పాటు చేసిన ఉపాధి పథకంలోకి తిమింగలాలు జొరబడ్డాయని విమర్శించారు. గతేడాది జిల్లాలో జరిగిన ఉపాధి పనుల్లో పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నాయన్నారు. ఉపాధి నిధుల్లో అవినీతికి పాల్పడిన రాజకీయ నాయకులు, వారికి సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు పెట్టి పూర్తి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు జరిగిన సామాజిక తనిఖీల్లో రూ.5.38కోట్లు పక్కదారి పట్టినట్లు గుర్తించి కేవలం రూ.34లక్షలు రికవరీకి ఆదేశించడమేంటని ప్రశ్నించారు.

ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా యశ్వంతపూర్-ముజఫ్ఫర్‌పూర్ మధ్య అప్ అండ్ డౌన్ ప్రతేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. యశ్వంతపూర్-ముజఫ్ఫర్‌పూర్ ప్రత్యేక రైలు (నెం. 06251) ఈ నెల 4న యశ్వంతపూర్‌లో ఉదయం ఏడున్నరకు బయలుదేరి ఈనెల 6న ఉదయం ఏడున్నరకు ముజఫ్ఫర్‌పూర్‌కు చేరుతుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 06252) ముజఫ్ఫర్‌పూర్‌లో ఈ నెల 8న ఉదయం పదిన్నరకు బయలుదేరి ఈ నెల 10న మధ్యాహ్నం 1 గంటకు యశ్వంతపూర్‌కు చేరుతుందన్నారు. ఈ రైలు ధర్మవరం, డోన్, కర్నూలు సిటీ, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజీపేట్, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, నాగపూర్, ఇటార్సి, జబల్పూర్, కట్నీ, సాట్నా, ప్రయాగరాజ్, ముఘల్‌సరాయ్, బక్సర్, ఆర, దానాపూర్, పాటలీపుత్ర, సోన్‌పూర్, హాజీపూర్ మీదుగా గమ్యానికి చేరుతాయన్నారు.

ఎమ్మార్సీలో ఏసీబీ అధికారుల తనిఖీ

కూడేరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో ఏసీబీ అధికారులు శనివారం మరోసారి తనిఖీలు నిర్వహించారు. ఏసీబీ సీఐ హేమంత్ కుమార్‌రెడ్డి సిబ్బంది ఎమ్మార్సీలోని రికార్డులు పరిశీలించారు. ఇక్కడ ఎంఈఓగా పనిచేసిన చంద్రశేఖర్ సెప్టెంబరు 17న మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనపై కేసు నమోదు చేసిన విషయం విదితమే.

8న జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశాలు

అనంతపురం విద్య, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఈ నెల 8న నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఆర్థిక, ప్రణాళిక సంఘం, వర్క్స్, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్య స్టాండింగ్ కమిటీ సమావేశాలు, జడ్పీలోని అదనపు సమావేశ మందిరంలో మహిళ, శిశు సంక్షేమం, వ్యవసాయం, సాంఘిక సంక్షేమం స్టాండింగ్ కమిటీ సమావేశాలు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు.

నేడు ఉచిత లఘుచిత్ర ప్రదర్శన

అనంతపురం కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): భ్రూణహత్యల నివారణపై నిర్మించిన సందేశాత్మక లఘుచిత్రం 'ప్రశ్న'ను ఆదివారం ఉదయం 9 గంటలకు నగరంలోని ఎస్-మాక్స్ థియేటర్‌లో ఉచితంగా ప్రదర్శించను న్నారు. ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ ఆధ్వర్యంలో తరిమెల రాజు దర్శకత్వంలో ఈ చిత్రం నిర్మించినట్లు తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్ష కార్యదర్శులు టీపీ రెడ్డి, అల్తాఫ్ శనివారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని కళాకారులు, రచయితలు ప్రజలు విచ్చేసి వీక్షించాలని కోరారు.

ఉత్కంఠగా ఎన్నికలు

రసవత్తరంగా సాగిన ఎరువుల డీలర్ల సంఘం ఎన్నికలు


బ్యాలెట్ ద్వారా రహస్య పద్ధతిలో ఓటింగ్

భారీగా హాజరైన ఉమ్మడి జిల్లా డీలర్లు

అనంతపురం అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు రసవత్తరంగా జరిగాయి. నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 10 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ముందుగా ఒక కౌంటర్‌లో డీలర్‌షిప్ లైసెన్స్, జీఎస్టీ జిరాక్స్ ప్రతులు స్వీకరించి రెండు డాక్యుమెంట్లకు జత చేసి రసీదును అందజేశారు. వాటి ఆధారంగా రెండో కౌంటర్‌లో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారి పదవులకు పోటీలో ఉన్న ఇద్దరు చొప్పున అభ్యర్థుల బ్యాలెట్ పత్రాలు విడివిడిగా అందజేశారు. సంఘం అధ్యక్ష పదవికి చింతా వెంకటేశ్వర్లు, పార్థసారథి పోటీలో నిలిచారు. ప్రధాన కార్యదర్శి పదవికి భాస్కర్‌రెడ్డి, సిరిగుప్ప వెంకటేశ్వర్లు, కోశాధికారి పదవికి రమేష్ రంగయ్య, వెంకటేష్ బాబులు పోటీపడ్డారు. బ్యాలెట్ పత్రాలు అందజేసిన తర్వాత మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల దాకా రహస్య పద్ధతిలో పోలింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు పోటీదారుల సమక్షంలో కౌంటింగ్ నిర్వహించారు. ఆ తర్వాత ఫలితాలు ప్రకటించారు. కౌంటింగ్ సమయంలో పోటీలోని అభ్యర్థులతోపాటు డీలర్లల్లో ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా చింతా వెంకటేశ్వర్లు

ఉమ్మడి జిల్లా ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చింతా వెంకటేశ్వర్లు గెలుపొందారు. ఆయనకు 629 ఓట్లు రాగా. పార్థసారథికి 89 వచ్చాయి. ప్రధాన కార్యదర్శి పదవికి పోటీలో ఉన్న భాస్కర్‌రెడ్డికి 360 ఓట్లు రాగా, సిరిగుప్ప వెంకటేశ్వర్లుకు 356 ఓట్లు వచ్చాయి. కోశాధికారి పదవికి పోటీలో ఉన్న రమేష్ రంగయ్యకు 366 ఓట్లు రాగా, వెంకటేష్ బాబుకు 353 ఓట్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో అధ్యక్షుడిగా చింతా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా రమేష్ రంగయ్యలు గెలుపొందారు. ఉపాధ్యక్షులుగా గంగాధర్, సీకే రవి, కార్యదర్శులుగా అమర్‌నాథ్‌రెడ్డి, ముజీత్‌ఖాన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, ఇతర నాయకులు, డీలర్లు శాలువ కప్పి, పూల మాలలు వేసి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



డీలర్లకు బ్యాలెట్ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గ సభ్యులకు సత్కారం

కర్పూరం ఘటనపై కదలిక



వైద్యులు, కుటుంబ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాధితులను పరామర్శించిన కలెక్టర్

మెరుగైన చికిత్సపై కుటుంబ సభ్యులకు భరోసా

అనంతపురం టౌన్, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): కర్పూరం ఫ్యాక్టరీలో శుక్రవారం జరిగిన ప్రమాదం పట్ల జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. శింగనమల మండలంలోని కర్పూరం ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం రియాక్టర్ శుభ్రం చేయడానికి వెళ్లి ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టుచప్పుడు



బాధితుడు హరిని పరామర్శిస్తున్న కలెక్టర్

కాకుండా బాధితులను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. తర్వాత ఆ ఫ్యాక్టరీ ప్రతినిధులు గానీ సంబంధిత అధికారులు గానీ వారిని పట్టించుకోలేదన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో స్పందించిన కలెక్టర్ శనివారం ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. వారి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి, ప్రమాదం జరిగిన తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు, అధికారులు, బాధిత కుటుంబసభ్యులతో కలెక్టరు ప్రత్యేకంగా ఆస్పత్రిలోనే సమావేశమయ్యారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని ఆదేశించారు. డీఎంహెచ్ఓ అక్కడే ఉంటూ పర్యవేక్షించాలని ఆదేశించారు. బాధితులు వైద్య ఖర్చుల గురించి ఆందోళన చెందాల్సిన పని లేదని, అంతా ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏదైన సమస్య వస్తే శింగనమల తహసీల్దార్‌కుగానీ, లేదా నేరుగా తనకే తెలియజేయవచ్చని భరోసా ఇచ్చి ఫోన్ నెంబర్లు కూడా ఇచ్చారు.

బాధితులంతా సేఫ్

కర్పూరం ఫ్యాక్టరీలో అస్వస్థతకు గురైన ఆరుగురు ఆరోగ్యంగా ఉన్నారని, ఎలాంటి ప్రమాదంలేదని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బాధితులను పరామర్శించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం 9గంటల సమయంలో రియాక్టర్‌లోకి దిగిన కార్మికులు ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురి కాగా 10-15 గంటలకు వారిని నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. బాధితుల్లో ఒకరి ఆరోగ్య పరిస్థితి మధ్యాహ్నానికే కుదుట పడటంతో డిశ్చార్జ్ అయ్యి వెళ్లిపోయినట్లు తెలిపారు. నాగేంద్రప్రసాద్, కృష్ణ, లక్ష్మీనారాయణ, సారయ్య, హరినాథ్‌బాబు ఇంకా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. వీరిలో ముగ్గురు ఆరోగ్యంగా ఉండటంతో సాధారణ వార్డుకు తరలించారన్నారు. మిగిలినవారి పరిస్థితి కూడా బాగా మెరుగవుతోందని తెలిపారు. బాధితుల వైద్యఖర్చులను మొత్తం ఫ్యాక్టరీ యాజమాన్యమే భరించాలిని ఆదేశించినట్లు తెలిపారు. ఇంటికి వెళ్లిన తర్వాత కూడా డాక్టర్ల పర్యవేక్షణ చేయాలని, అపుడు కూడా వారికి ఎలాంటి చికిత్స కావాలన్నా అందించాలని ఆదేశించామన్నారు. ఇప్పటికే ఈ ఘటనపై విచారణకు అధికారుల బృందాన్ని పంపామని, వారిచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదంపై విచారణ

కర్పూరం ఫ్యాక్టరీని తనిఖీ చేసిన విచారణ బృందం



ఘటనా స్థలాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

శింగనమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి వద్ద ఉన్న సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంపై కలెక్టర్ నియమించిన విచారణ బృందం అధికారులు శనివారం విచారణ చేపట్టారు. అనంతపురం ఆర్డీఓ వసంతబాబు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ మునీప్రసాద్, కార్మికశాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీనరసయ్య, పరిశ్రమల శాఖ డీఎస్పీ వెంకటేశులు, పరిశ్రమలశాఖ ఇన్‌స్పెక్టర్ కేశవయ్య, భూగర్భ జలశాఖ అధికారులు దాదాపు రెండు గంటల సేపు విచారణ చేపట్టారు. మొదట యాజమాన్యంతో ఫ్యాక్టరీకి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. ప్రమాదం జరిగిన తీరుపై అక్కడి కార్మికులతో వివరాలు సేకరించారు. తర్వాత ప్రమాదం జరిగిన ఆర్-3 రియాక్టర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య, సీఐ కౌలుట్లయ్య , ఎస్ఐ శరత్ చంద్ర పాల్గొన్నారు.

ఆక్సిజన్ అందకపోవడం వల్లే: వసంతబాబు, ఆర్డీఓ

సప్తగిరి కర్పూరం ఫ్యాక్టరీలో ఆర్-3 రియాక్టర్‌ను మరమ్మతులు చేస్తుండగా ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురైన విషయం వాస్తవమే. ప్రస్తుతం వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ విచారణ కమిటీ వేయగా వచ్చి పరిశీలించాం. రియాక్టర్‌లో మరమ్మతులు చేయడానికి వెళ్లినవారికి ఆక్సిజన్ అందక అస్వస్థతతో పడిపోయారు. వారికి బయటికి తీయడానికి మరో నలుగురు కార్మికులు వెళ్లగా వారు కూడ అస్వస్థతకు గురయ్యారని సంఘటన స్థలాన్ని తనిఖీ చేశాక అర్థం అవుతోంది. మా నివేదికను కలెక్టర్ పంపుతాం. ప్రమాదానికి ఎలాంటి విషవాయువులు వెలువడలేదని తెలుస్తోంది.

ప్రియుడే హంతకుడు

మహిళ హత్య కేసు ఛేదింపు



హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్ల గ్రామానికి చెందిన మెహతాజ్‌ను ప్రియుడు ఇర్ఫాన్ బాషా హత్య చేసినట్లు ఎస్పీ రత్న తెలిపారు. తనను కాదని మరొకరితో చనువుగా ఉందన్న అనుమానంతోనే ప్రియుడు చంపేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ కేసులో నిందితుడు ఓబుళదేవరచెరువు మండలం డబురువారిపల్లికి చెందిన ఇర్ఫాన్‌బాషాను పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు ఛేదింపు వివరాలను ఎస్పీ వెల్లడించారు. ఇర్ఫాన్‌బాషాతో మెహతాజ్ చనువుగా ఉండేది. ఆమె ఇటీవలిగా మరొకరితో చనువుగా ఉంటోందని ఇర్ఫాన్‌బాషా అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఆమెను చంపాలని నిర్ణయించుకున్నాడు. గతనెల 31వ తేదీన ఆమె కొండకమర్లలోని తల్లితండ్రుల ఇంటికి వచ్చిందని తెలుసుకుని రాత్రి 11.30 గంటల సమయంలో ఇర్ఫాన్ బాషా ఫోన్ చేశాడు. మిద్దెమీదకు రావాలనీ, మాట్లాడాలని చెప్పాడు. అమె మిద్దెమీదకు రాగానే వేరొకరితో సంబంధం ఉందంటూ నిలదీశాడు. అలాంటిదేమీ లేదని ఆమె చెప్పుకొచ్చింది. మాటామాటా పెరిగి, ఆమె గొంతు నులిమి ఇర్ఫాన్ బాషా హత్య చేశాడు. దీనిపై మృతురాలి తండ్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని, పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడిని శనివారం పోలీసులు ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లి బస్టాప్ వద్ద అరెస్టు చేశారని ఎస్పీ వెల్లడించారు. సమావేశంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓబుళదేవరచెరువు ఎస్ఐ మల్లికార్జునరెడ్డిపాల్గొన్నారు.

సరిహద్దులో నేరాలను అరికట్టాలి: ఎస్పీ రత్న



జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దులో నేరాలను అరికట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. డీపీఓలోని తన చాంబర్ నుంచి సరిహద్దు పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో శనివారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. సరిహద్దులో అసాంఘిక కార్యకలాపాలు, అక్రమరవాణా నివారణకు పటిష్ట నిఘా ఉంచాలన్నారు. జూదం, గంజాయి, మట్కా, అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసులు తరచూ గ్రామాలను సందర్శిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు.

బీజేపీ నాయకుడిపై వైసీపీ మూకల దాడి



గాయపడిన సతీశ్

ముదిగుబ్బ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని సిరిగారిపల్లిలో వైసీపీ మూకలు రెచ్చిపోయారు. బీజేపీ నాయకుడు సతీశ్‌పై దాడికి తెగబడ్డారు. పట్నం ఏఎస్ఐ లోకనాథ్ తెలిపిన వివరాల మేరకు... సతీశ్‌తో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రెడ్డిబాబు, రాధాకృష్ణకు గతం నుంచి గొడవలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి సతీశ్ ఫోన్‌లో మాట్లాడుతుండగా రెడ్డిబాబు, రాధాకృష్ణ వచ్చి, నానా దూర్భాషలాడారు. మాటామాటా పెరిగి ఘర్షణ పడ్డారు. సతీశ్‌పై రెడ్డిబాబు, రాధాకృష్ణ రాయితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. సతీశ్‌ను కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

యల్లనూరు/తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం యల్లనూరులోని చెరువుకట్ట వద్ద శనివారం 212 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు. యల్లనూరు మద్యంషాపు నుంచి మద్యం బాటిళ్ల తీసుకువెళుతున్నట్లు సమాచారం రావడంతో దాడిచేశామన్నారు. ఈ దాడిలో శింగవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు, కోడిమూర్తి గ్రామానికి చెందిన వీరాంజనేయులును అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు తెలిపారు. తాడిపత్రి మండలంలోని సజ్జలదిన్నె క్రాస్ వద్ద మద్యం విక్రేత రాజమ్మను అరెస్ట్‌చేసి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ నాయుడు తెలిపారు.

స్కూల్ కరస్పాండెంట్‌పై దాడి

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న సూర్య హైస్కూల్ కరస్పాండెంట్ దూదేకుల బాబయ్యపై కిరణ్‌తోపాటు మరికొందరు దాడిచేసి గాయపరిచినట్లు పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన కిరణ్‌తోపాటు మరికొంతమంది ఓపెన్ ఇంటర్మీడియట్ సర్టిఫికెట్ కోసం స్కూల్ వద్దకు వెళ్లి అడిగారు. వాటిని ఇవ్వకపోవడంతో మాటమాట పెరిగి అతడిపై దాడిచేయడంతో తలకు, ముఖంపై రక్తగాయాలయ్యాయని తెలిపారు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఉరవకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని అనంతపురం రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజి(22) అనే యువకుడు మృతి చెందాడు. ఉరవకొండకు చెందిన అంజి, నరసింహులు, సాయి ద్విచక్రవాహనంలో అనంతపురం వైపు వెళ్తుండగా ఉరవకొండ సమీపంలోని రాములమ్మ గుడి వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ద్విచక్రవాహనం ఢీకొనడంతో అంజికి తలకు తీవ్ర గాయాలు కాగా, మరో ఇద్దరు గాయపడ్డారు. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన అంజి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ తెలుసుకుని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ల సొమ్ము స్వాహా..!

వేలిముద్రలు వేయించుకుని డబ్బు ఇవ్వని వైనం

సింగనహళ్లిలో సచివాలయ ఉద్యోగి చేతివాటం

బొమ్మనహాళ్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వేలిముద్రలు వేయించుకుని వృద్ధులకు, వికలాంగులకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా స్వాహా చేసిన ఓ సచివాలయ ఉద్యోగి నిర్వాకం బొమ్మనహాళ్ మండలంలోని సింగానహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. గోనేహాళ్ గ్రామ సచివాలయ ఉద్యోగి రమేష్ సింగానహళ్లిలో దాదాపు 15 మంది పింఛన్‌దారుల వద్దకు వెళ్లి వేలిముద్రలు వేయించుకున్నాడు. డబ్బులు మళ్లీ వచ్చి ఇస్తానని రెండురోజులైనా ఇవ్వలేదని గ్రామానికి చెందిన పక్కీరమ్మ, రుద్రమ్మ, భాగ్యమ్మ, మారెక్క, హెచ్.కెంచప్ప, వంద్రక్క, హెచ్. దానప్ప, ఆంజనేయులు, గిడ్డ కెంచప్ప తెలిపారు. ఆ గ్రామానికి చెందిన పూర్తి దివ్యాంగుడు మంచంపై ఉంటున్న శివప్పతో వేలుముద్రలు వేయించుకుని రూ. 15 వేలు ఇవ్వలేదు. ప్రభుత్వం ఇచ్చే పింఛనే తమకు ఆధారమని వాటితోనే మందులు వంటివి కొనుగోలు చేస్తామని బాధితులు వాపోయారు. ఈ సచివాలయ ఉద్యోగి గతంలో కూడా ఇలాగే చేశాడని గ్రామస్తులు చెప్పారు. అధికారులు పర్యవేక్షణ లేని కారణంగా పింఛన్ డబ్బులు వాడుకుంటున్నారని తెలుస్తోంది. సచివాలయ ఉద్యోగితో తమకు



డబ్బు ఇవ్వలేదని చెబుతున్న వృద్ధులు

పింఛన్ డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

విచారించి.. చర్యలు తీసుకుంటాం

శింగనహళ్లిలో వేలిముద్రలు వేయించుకుని పింఛన్ల డబ్బులు ఇవ్వని విషయం నా దృష్టికి వచ్చింది. దీనిపై సచివాలయ ఉద్యోగిపై ఫిర్యాదులు కూడా



వచ్చాయి. విచారించి చర్యలు తీసుకుంటాం. ఆదివారం పింఛన్ డబ్బులు అందించేలా చర్యలు తీసుకుంటాం.

- దాస్ నాయక్, ఎంపీడీఓ

వర్సిటీ ఆదేశాలను పాటించాల్సిందే

ఫార్మసీ కళాశాలలను హెచ్చరించిన జేఎన్‌టీయూ వీసీ



ఫార్మసీ కళాశాలల అధికారులతో వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, నవబంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్సిటీ ఆదేశాలను పాటించకపోతే చర్యలు తప్పవని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఫార్మసీ కళాశాలల అధికారులను హెచ్చరించారు. జేఎన్‌టీయూ అనుబంధ ఫార్మా-డీ కళాశాలల అధికారులతో ఆయన శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై చర్చించారు. ఫార్మసీలో పరిశోధనలపై దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా వీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్యతోపాటు కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్తీక మాసం కావడంతో భక్తులు పెన్నానదిలో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

రికార్డు సృష్టిస్తాం

శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం

అనంతపురం విద్య, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మ్యాథ్స్ ఫార్ములాలతో ఈ ఏడాది రికార్డు సృష్టిస్తామని శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలోనే జిల్లా నుంచి అత్యధికంగా తమ పాఠశాలల విద్యార్థులు లండన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. శ్రీచైతన్య సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులను శనివారం ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా జిల్లా నుంచి 22 మంది శ్రీచైతన్య విద్యార్థులు మాస్టర్ మైండ్స్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారన్నారు. ఈ విద్యార్థులకు ప్రత్యేకంగా కో-ఆర్డినేటర్ల ద్వారా శిక్షణ ఇప్పించామన్నారు. ఈనెల 6న 668 మ్యాథ్స్ ఫార్ములాలతో ప్రపంచ రికార్డ్ పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కరీముల్లా, ఇతర విద్యార్థులు పాల్గొన్నారు.



మాస్టర్ మైండ్స్ ప్రోగ్రాం విద్యార్థులతో ఏజీఎం సుబ్బారెడ్డి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, పీడీలు

గుత్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి జట్టు క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఉష తెలిపారు. ఇటీవల అనంతపురంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో తొమ్మిదో తరగతి నవ్య, పదో తరగతి చదువుతున్న స్వాతి అనే విద్యార్థినులు వెయిట్‌లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను హెచ్ఎంతో పాటు పీడీలు సరోజ, శకుంతల, శ్యామల అభినందించారు.

ప్రిన్సిపాల్‌గా విష్ణువర్ధన్



ప్రొఫెసర్ విష్ణువర్ధన్

అనంతపురం సెంట్రల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ విష్ణువర్ధన్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల డిప్యూటీ ఎగ్జామినేషన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. స్పాన్సర్ రీసర్చ్ డైరెక్టర్‌గా ఈశ్వర్‌రెడ్డి, ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్(ఐక్యూఏసీ) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పద్మసువర్ణను నియమించారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య శనివారం ఉత్తర్వులు జారీచేశారు.

టమోటా కిలో రూ.30



అనంతపురం రూరల్, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శనివారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

జీడిపల్లి రిజర్వాయర్‌లో నీటి నిల్వ 1.658 టీఎంసీలు

బెళుగుప్ప, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 1.658 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1039 క్యూసెక్కులు వుండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 1068 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

ఆక్రమిస్తా.. నా ఇష్టం..

తొలగించాలని చూస్తే ఎస్సీ, ఎస్టీ వేధింపుల కేసు పెడతా

అధికారులకు వైసీపీ నాయకుడి బెదిరింపులు

ధర్మవరం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు బరితెగించాడు. ఏకంగా రోడ్డునే ఆక్రమించి, బండలు పాతాడు. ఇది సరికాదనీ, వెంటనే బండలు తొలగించుకోవాలని సూచించిన అధికారులనే బెదిరించాడు. బండలు తొలగించాలని చూస్తే ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు పెడతానన్నాడు. దీంతో వారు అవాక్కయ్యారు. వారిని తీవ్రంగా దూషిస్తూ దాడి చేసినంత పని చేశారు. దీంతో వారు అక్కడినుంచి వెళ్లిపోయారు.

అధికార భ్రమలోనే..

వైసీపీ అధికారం కోల్పోయి ఐదునెలలు దాటినా ఇంకా ఆ పార్టీ నాయకులు అధికార భ్రమలో ఉన్నట్లుంది. ఇప్పటికే పేదల స్థలాలను ఆక్రమించుకుని, స్వాహా చేశారు. అది చాలదన్నట్లు ప్రస్తుతం రోడ్లను సైతం వదలడంలేదు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో మాజీ కౌన్సిలర్, వైసీపీ నాయకుడు రామయ్య ఏకంగా డ్రైనేజీని, ఆ తరువాత మరింత రోడ్డును ఆక్రమించి, బండలు పాతేశాడు. విషయం తెలుసుకున్న మున్సిపల్ పట్టణ ప్రణాళికాధికారి (టీపీఓ) సాయిప్రసాద్, సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించారు. డ్రైనేజీతోపాటు రోడ్డును సైతం అక్రమించినట్లు నిర్ధారించారు. ఆక్రమిత స్థలంలో నాటిన బండలను తొలగించుకోవాలని టీపీఓ.. రామయ్యకు సూచించారు. దీంతో రామయ్య రెచ్చిపోయాడు. 'రోడ్డంతా ఆక్రమిస్తా, ఏం చేసుకుంటారో చేసుకోండి. ఎక్కువ మాట్లాడితే మీపైనే కాదు, మీ కమిషనర్‌పై కూడా ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టిస్తా. నేనంటే ఏమనుకున్నారో.. జాగ్రత్త..' అంటూ సిబ్బందిపై చిందులు తొక్కాడు. భౌతికదాడులకు ఎక్కడ దిగుతాడోనన్న భయంతో సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోక తప్పలేదు. దీనిపై టీపీఓ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించి, నాటిన బండలను తొలగించుకోమన్నందుకు రామయ్య దుర్భాషలాడాడన్నారు. విషయాన్ని సోమవారం మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని టీపీఓ వెల్లడించారు.



డ్రైనేజీతోపాటు రోడ్డును సైతం ఆక్రమించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి సండే క్లాసిఫైడ్స్ SUNDAY CLASSIFIEDS

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 198455

TO-LET

ప్రకాష్ రోడ్డు, (కోర్టు రోడ్ ప్రక్కన) 7-111 డో.నెం. నందు వాస్తు అనురించి తూర్పు దిక్కున గల ఇల్లు. మొదటి అంతస్తులో విశాలమైన (1500చ.అ) 2 బెడ్ రూమ్ ఇల్లు. కార్ పార్కింగ్ సదుపాయంతో అద్దెకు కలదు. సంప్ర: 9440907157

AJA-198092

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ చిన్న ప్రకటన పెద్ద స్పందన

WANTED

Wanted Computer Operator With Experiance On Tally & GST Returns Qualification : B.Com., Contact:9676710666,ATP.

AJA-JAYASREE

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సంక్షిప్తం

పొలాల్లో డ్రిప్ బిగింపుపై శిక్షణ

అనంతపురం అర్బన్, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో డ్రిప్ పరికరాల బిగింపుపై ఫిట్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్థానిక ఉద్యాన శిక్షణాకేంద్రంలో శనివారం ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఫిట్టర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలాల్లో డ్రిప్ బిగించడంపై సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ... గతంలో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో కంపెనీని ఎంపిక చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకునేవారన్నారు. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ ద్వారా రైతులు సెల్ఫ్ రిజిస్ట్రేషన్‌ను సొంతంగా చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ఉన్నతాధికారులు కల్పించారన్నారు.

నేడు అనంతకు హీరో శ్రీకాంత్

అనంతపురం కల్చరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సినీహీరో శ్రీకాంత్ ఆదివారం అనంతపురం రానున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రేయాస్ గ్రాండ్ హోటల్ 'టేస్ట్ ఆఫ్ ఫులావ్స్' వెజ్ అండ్ నాన్‌వెజ్ రెస్టారెంట్‌ను హీరో శ్రీకాంత్ చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు శ్రేయాస్ గ్రాండ్ హోటల్ నిర్వాహకులు, ఎండీ లక్ష్మీకాంత రెడ్డి శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ



హైదరాబాద్‌లో బాధితురాలికి పింఛన్ అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

రాప్తాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న పింఛన్ లబ్ధిదారురాలికి డిజిటల్ అసిస్టెంట్ హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ అందజేశారు. మండలంలోని ప్రసన్నాయపల్లికి చెందిన వరలక్ష్మి రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో రెండు నెలలు అనంతపురంలో చికిత్స పొందింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు నవంబరు నెల పింఛన్ సొమ్ము రూ. 10 వేలును డిజిటల్ అసిస్టెంట్ చంద్రమౌళి శనివారం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లి అందజేశారు.

'బాధితులకు అండగా ఉంటాం'

కనగానపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వివిధ రకాల కారణాలతో మరణించిన వారి కుటుంబాలకు అండగా ఉంటామని, అధైర్య పడవద్దని ఎమ్మెల్యే పరిటాల సునీత ధైర్యం చెప్పారు. మండలంలోని తగరకుంట గ్రామంలో గుండెపోటుతో మృతిచెందిన డీలర్ రెడ్డి గోవిందు ఇంటికి ఆమె శనివారం వెళ్లారు. ఆ కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అలాగే ఇటీవల మరణించిన ఈడిగ రాజగోపాల్ ఇంటికి వెళ్లి, కుటుంబసభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, సుధాకర్‌చౌదరి, సర్పంచ్ మాధవరాజు, సోమర చంద్రశేఖర్, రామాంజి, రాజాకృష్ణ, బిల్లే దాము ఉన్నారు.

పేదల వైద్యంపై దృష్టిపెట్టాలి

అనంతపురం సెంట్రల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదలకు అందించే వైద్యసేవలపై ప్రత్యేక దృష్టిపెట్టకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రుల దోపిడీలో అభాగ్యులు బలవుతున్నారని ఎస్సీ ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని శనివారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం డాక్టర్ సుజాతకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, నారాయణస్వామి, నాగేంద్ర, దిలీప్, లక్ష్మీదేవి, గోపాల్ పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికుల భిక్షాటన

అనంతపురం క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శనతో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. శనివారం మున్సిపల్ కార్యాల యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటనారాయణ, నాగభూషణ, ఏటీఎం నాగరాజు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంహెచ్‌ఓ విష్ణుమూర్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన అవినీతి పరాకాష్టకు చేరిందన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

బైక్‌ల దొంగ అరెస్ట్

రూరల్ పోలీసులు ఓ ద్విచక్రవాహనాల చోరీ నిందితుడి అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ శేఖర్ సిబ్బందితో కలిసి శనివారం శ్రీ సత్యసాయి జిల్లా కనగాన పల్లి మండలం కేఎన్ పాళ్యానికి చెందిన ఎరుకల వేణును అరెస్ట్ చేశారు. అతడి నుంచి నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇతడికి గతంలోనూ ఆత్మకూరు, నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులున్నాయి.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పేకాడుతున్న నలుగురిని త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. నగరంలోని గుత్తి రోడ్డులోని మార్కెట్‌యార్డు వెనుకవైపు బహిరంగ ప్రదేశంలో పేకాడుతుండగా త్రీటౌన్ పోలీసులు దాడులు నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7930 స్వాధీనం చేసుకున్నారు.

పడిగాపులతో సరి..!

- జనన, మరణ ధ్రువీకరణ కోసం వారాలకొద్దీ నిరీక్షణ
- పట్టించుకునే వారు లేరని ప్రజల ఆవేదన



కార్యాలయం వద్ద వేచి ఉన్న దరఖాస్తుదారులు



కార్యాలయంలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

శింగనమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్ని రోజులు తిరిగినా స్థానిక స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జనన మరణ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఇక్కడి అధికారులు ఎప్పుడు వస్తారో..? ఎప్పుడు వెళతారో..? అర్థం కావడం లేదని మండి పడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఉదయం 11.30 గంటలకు ఒక సీనియర్ అసిస్టెంట్ మాత్రం వచ్చారు. అయితే జనన మరణ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించే అధికారి రాలేదు. ఆయన కోసం పలువురు ఉదయం నుంచి వేచి చూడాల్సి వచ్చింది. వారిలో చాలామంది దరఖాస్తు చేసుకుని రెండు వారాల నుంచి ఎదురు చూస్తున్నట్లు వాపోయారు. కార్యాలయంలో కనీసం దరఖాస్తులను చూసే నాథేడే లేరని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. పరిశీలనకు నోచుకోని జనన మరణ ధ్రువ పత్రాల కోసం వచ్చిన దరఖాస్తులు అధిక సంఖ్యలోనే కార్యాలయంలో ఉన్నట్లు తెలుస్తోంది. రిజిస్టర్ చేయడానికి ఎన్ని సార్లు అడిగినా సంబంధిత అధికారి దరఖాస్తులను రికార్డు రూం నుంచి తీయడం లేదని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఆధార్ కార్డులో తప్పులు సరిచేసుకోవాలంటే జనన ధ్రువీకణ పత్రం తీసుకుని రావాలని అంటున్నారు. దరఖాస్తు చేసి వారాలు గడుస్తున్నా ఇక్కడ ఇవ్వడంలే దని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. విద్యార్థులకు ఆధార్‌కార్డు మార్పు కోసం సమయం అయిపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెండు వారాల నుంచి తిరుగుతున్నా



నా కుమారుడు రజాక్ జనన ధ్రువీ కరణ పత్రం కోసం రెండు వారాల కిం ద తహసీల్దార్ కార్యాలయంలో దర ఖాస్తు చేశాను. అ రోజు నుంచి సార్, మేడం రాలేదని కాలం గడుపుతు న్నా రు. నాలుగురోజుల నుంచి కార్యాల యం చుట్టూ తిరుగుతున్నా పని జరగలేదు.

- ఇమామ్ హుసేన్, ఆకులేడు

ఇంకా ఎన్ని తిప్పలు పడాలో..!



నా కుమారుడు, కుమార్తె పేర్లలో అక్షరాలు తప్పులున్నాయి. అవి సరిచేసుకునేందుకు జనన ధ్రువీకరణ పత్రాల కోసం నాలుగు రోజుల కింద దరఖాస్తు చేశాను. అయితే అధికారులు మీ రిజిస్టర్ రికార్డు రూంలో ఉందని దాని బయటికి తీయాలంటూ కాలం గడుపుతున్నారు. శనివారం కార్యాలయం వద్దకు వచ్చినా ఒక్క అధికారి కూడా లేరు. ఇంకా ఎన్నిరోజులు తిరగాలో... ఈ పత్రాలు కోసం ఎన్ని తిప్పలు పడాలో తెలియడం లేదు.

- చంద్రకళ, సి.బండమీదపల్లి

కూటమితో గుంతల రోడ్లకు మోక్షం

ఎమ్మెల్యే పరిటాల సునీత



గుంతల రోడ్లను పూడ్చే పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత


కనగానపల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ హయాంలో తట్టెడు మట్టి కూడా రోడ్లపై వేయనిదుస్థితి ఉండేదని, అదే కూటమి ప్రభుత్వంలో గుంతల రోడ్లకు మోక్షం లభించిందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేపట్టిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని కనగానపల్లిలో శనివారం ప్రారంభించారు. స్థానిక పండమేరు వంక వద్ద ఉన్న గతుకుల రోడ్లను చదును చేసి, తారు రోడ్డు నిర్మించే పనులను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ పాలనలో ప్రజలు ప్రయాణించాలంటే గుంతల రోడ్లతో ఇబ్బందులు పడేవారన్నారు. అవసరమున్నచోట కూడా కనీసం మట్టిని వేయలేదన్నారు. రాష్ట్రమంతా ఒక ఎత్తైతే రాప్తాడు నియోజకవర్గంలో మంజూరైన రోడ్లను కూడా వేయనీకుండా అప్పటి ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి అడ్డుకున్నారన్నారు. ఏపీలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమానికి ప్రభుత్వం రూ.860 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలో 11 రోడ్లకు రూ.2.84 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 318 కిలోమీటర్ల రహదారి ఉండగా, 125.35 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు దెబ్బతిన్నాయని అన్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో 94 కిలో మీటర్ల వరకు మరమ్మతుల పనులు చేపడుతామని, మిగిలిన దెబ్బతిన్న రోడ్లకు త్వరలోనే పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ జేఈ హారిక, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అనిల్ కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేశ్, కన్వీనర్ యాతం పోతలయ్య, సుధాకర్‌చౌదరి, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, తెలుగుయువత సురేశ్‌చౌదరి పాల్గొన్నారు.

బాధిత కార్మికులకు పరామర్శ



కార్మికుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్, ఆలం నరసానాయుడు

అనంతపురం అర్బన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సప్తగిరి కర్పూరం పరిశ్రమలో రియాక్టర్ నుంచి వెలువడిని విషవాయువులు పీల్చి తీవ్ర అస్వస్థతకు గురైన బాధిత కార్మికులు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, శింగనమల ద్విసభ్య కమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి పరామర్శించారు. వారు శనివారం బాధిత కార్మికులు చికిత్స పొందుతున్న అనంతపురం నగర శివారులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అక్కడి డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ... ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఆసుపత్రిలో కార్మికులను పరామర్శిస్తున్న బండారు లీలావతి, టీడీపీ నాయకులు

●శింగనమల: స్థానిక కర్పూరం పరిశ్రమలో రియాక్టర్ నుంచి విషవా యువులు వెలువడి ఆరుగురు కార్మికులు అస్వస్థతకు గురి కావడం చాలా బాధాకరమని టీడీపీ నాయకురాలు బండారు లీలావతి పేర్కొన్నారు. ఆమె శనివారం బాధితులు చికిత్స పొందుతున్న అనంతపురం శివారులోని ఓ ప్రైవేటు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి, బాధిత కార్మికులను పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకు లు చితంబరిదొర, జీసీ బాబు గుర్రం లక్ష్మీనారాయణ, బండి పరశురాం తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కార్మికులను పరిశ్రమ యాజమాన్యం ఆదుకోవాలని కోరారు.

మిస్ ఫైర్ ఘటన విచారణాధికారిగా ఏఆర్ ఏఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ట్రెజరీలో జరిగిన గన్ పేలిన ఘటనపై విచారణాధికా రిగా ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషాను నియమించారు. శుక్రవారం తెల్లవారు జామున ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బ రాజు ఛాతి పక్క నుంచి బుల్లెట్ దూరిపో యిన సంగతి తెలిసిందే. దీనిపై ఎస్పీ సీరియస్‌గా దృష్టి సారించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే విచారణాధికారిగా నియమించినట్లు తెలుస్తోంది. సుబ్బరాజు రైఫిల్‌ను ఉపయోగించిన విధానంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ప్రశంసాపత్రాలు

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా అక్టోబరు 21 నుంచి 31 వరకు చేపట్టిన వివిధ కార్యక్రమాలలో ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బంది, డాక్టర్లు, టీచర్లు, విద్యార్థులకు ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మిగిలిన కార్యక్రమాల నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారికి మెమొంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

రుద్రంపేటలో 'గుంతల రహిత ఏపీ'



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు, అధికారులు

అనంతపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రంపేట పంచా యతీలో గుంతల రహిత ఏపీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం రుద్రంపేట - ఆలమూరు ప్రధాన రహదారిపై ఏర్పడిన గుం తలను మట్టితో పూడ్చారు. ఆర్‌అండ్‌బి డివిజనల్ అధికారి కాటమయ్య, పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా, టీడీపీ రాష్ట్ర నాయ కులు గంగారామ్, నాయకులు భక్తవత్సలం నాయుడు, ఈడిగ నాగభూషణం, బోయపాటి బాలప్ప, ఎస్ఎం బాషా, ప్రతాప్ పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు నెరువేరుస్తున్న ఎమ్మెల్యే'



తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ధర్మవరం మురళి, అధికారులు

రాప్తాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే పరిటాల సునీత నెరవేరుస్తున్నారని మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని మరూరు 44వ జాతీయ రహదారి నుంచి చాపట్ల గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ డీఈ రామచంద్రారెడ్డితో కలిసి భూమి పూజ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కురుబ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, మరూరు గోపాల్, కేశవ, సూరి, తెలుగు యువత రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్త: ఎస్పీ



సీఐ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందాక శేష జీవితాన్ని మంచి ఆరోగ్యంతో, సుఖంగా గడపాలని ఎస్పీ జగదీష్ ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన అనంతపురం సీసీఎస్ సీఐ నాగమణికి శనివారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ ఘనంగా సన్మానం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ...సమాజం కోసం సీఐ సుదీర్ఘకాలం సేవలందించారన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాజ్ బాషా, అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు ధరణికిషోర్, క్రాంతికుమార్, రాజేంద్రనాథ్‌యాదవ్, శ్రీకాంత్, శాంతిలాల్, సాయినాథ్, హేమంత్‌కుమార్, శేఖర్, రఘుప్రసాద్, వెంకటేష్‌నాయక్, ఆర్ఐ రాముడు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి ఉన్నత స్థానానికి చేరాలి

బాగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలు అధిరోహించాలని జిల్లా ఎస్పీ జగదీష్ పిలుపునిచ్చారు. జిల్లాకు చెందిన హోంగార్డుల పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాల మేరకు ప్రతిభా పురస్కారాలను జిల్లా ఎస్పీ అందజేశారు. స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి జిల్లాకు చెందిన 50 మంది పోలీస్ పిల్లలకు రూ.2.17లక్షల విలువ చేసే మెరిట్ స్కాలర్‌షిప్పులను పంపిణీ చేశారు.

అధ్వానంగా వైఎస్సార్ కాలనీ

- ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు
- విషసర్పాల సంచారం





వైఎస్సార్ కాలనీలో ఇళ్ల మధ్య పెరిగిన పిచ్చిమొక్కలు

అనంతపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట పంచాయతీ పరిధిలోని వైఎస్సార్ కాలనీ అధ్వానంగా తయారైంది. కాలనీలో ఇళ్ల మధ్య, రోడ్లపై పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో విషసర్పాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పారిశుధ్య నిర్వాహణ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. టీడీపీ అధికారం లోకి వచ్చిన తరువాత పంచాయతీ పరిధిలోని రోడ్లు, కాలువలను శుభ్రం చేయడంపై స్థానిక ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు స్థానికులు విమర్శిస్తున్నారు. కాలనీలో ఎక్కువ శాతం మట్టిరోడ్లు కావడం, ఖాళీ స్థలాలు ఉండటం వల్ల పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు బాగా పెరిగి పోయాయి. దీంతో కాలనీ విషసర్పాలకు నిలయం మారిందని స్థానికులు వాపోతున్నారు. కనీసం పిచ్చిమొక్కలు తొలగించినా కొంత ఊరటగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

భక్తిశ్రద్ధలతో గోవర్ధనగిరి పూజ



గోవర్ధనగిరి పూజ నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): లోకరక్షణకోసం శ్రీకృష్ణ పరమాత్ముడు గోవర్ధనగిరిని చిటికినవేలితో ఎత్తిన పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నగర శివా రులోని ఇస్కాన్ మంది రంలో గోవర్ధనగిరిపూజను భక్తిశ్రద్ధలతో నిర్వహిం చారు. ఈ సందర్భంగా అన్నకూటమితో గోవర్ధనిగిరిని ఏర్పాటుచేసి, రకరకాల పండ్లు, కూరగాయలతో గిరిని అలంకరించి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఇస్కాన్ మందిర ఛైర్మన్ దామోదర గౌరంగదాస్ కృష్ణతత్వంపై భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. మహామంగళహారతి నివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు ఎంపిక



నరేష్ నవదీప్ సాత్విక్ వరుణ్‌సాయి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-16 జట్టు శిబిరానికి జిల్లాకు చెందిన క్రికెటర్లు ఎంపికయ్యారు. ఈనెల 3వ నుంచి 13వతేదీ వరకు అనంత క్రీడాగ్రామంలో నిర్వహించే శిక్షణా శిబిరంలో సాత్విక్, నవదీప్, వరుణ్‌సాయి నాయుడు పాల్గొంటారు. జట్టుతో కలిసి ప్రాక్టీస్ మ్యాచ్‌లను ఆడుతారు. జిల్లాకు చెందిన సీనియర్ క్రీడాకారుడు నరేష్ బీసీసీఐ లెవెల్-1 కోచ్‌గా నియమితుడయ్యారు. క్రీడాకారులకు, కోచ్‌కు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

చెస్ ఫిడే రేటింగ్‌లో జిల్లాకు మెరుగైన ర్యాంకులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన చెస్ క్రీడా కారులకు ఫిడే రేటింగ్‌లో మెరుగైన ర్యాంకులు దక్కాయి. ప్రపంచ చదరంగ సమాఖ్య, అఖిల భారత చదరంగ సమాఖ్య సంయుక్తంగా గత నెలలో నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన సంజయ్‌సాహల్ 1401, సుకృతకు 1404 ర్యాంకులు సాధించారు. అంతర్జాతీయ స్థాయి లో ఉత్తమ ర్యాంకులు సాధించిన క్రీడాకారు లను ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, ఉదయ్ కుమార్ నాయుడు, గౌరవాధ్యక్షుడు బాలరాజు, కోశాధికారి కిశోర్‌నాయుడు శనివారం అభినందించారు.

క్రీడాకారులకు ఎమ్మెల్యే నగదు ప్రోత్సాహకం



జూడో క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకం అందించిన ఎమ్మెల్యే సునీత

రామగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి జూడో క్రీడాకారులకు ఎమ్మెల్యే పరిటాల సునీత నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. గత రెండేళ్ల నుంచి జాతీయ స్థాయి జూడో పోటీల్లో పాల్గొంటున్న నసనకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తేజస్విని, మేనక, రఘురాంను ఎమ్మెల్యే శనివారం అనంతపురంలోని పార్టీ కార్యాలయంలో అభినందించారు. వారికి రూ.20వేలు నగదును అందించారు. అదేవిధంగా జూడోమ్యాట్స్, డ్రెస్‌లను అందించేందుకు సహకరిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్‌కు జిల్లావాసులు



ఎంపికైన వారిని అభినందిస్తున్న డీఈఓ, కోచ్‌లు, పీడీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్ జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల రాజమండ్రిలో ఎస్‌జీఎఫ్-14, 17, 19 విభాగాల్లో నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ చాటి భోపాల్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. అండర్-14 బాలురలో తీక్షణ్ సాయి, బాలికల్లో ధాత్రి శివాని, అండర్-17లో గురుప్రవల్లిక, అండర్-19లో మల్లికాబాయి, అఖిల్ ఎంపికైన వారిలో ఉన్నారు. వారిని డీఈఓ ప్రసాద్ బాబు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సుగుణాబాయి శనివారం అభినందించారు.

ఎరువుల డీలర్ల సంఘం కార్యదర్శిగా ముజీబ్‌ఖాన్



కార్యదర్శిగా ఎంపికైన ముజీబ్‌ఖాన్

రామగిరి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుకు చెందిన ముజీబ్‌ఖాన్ ఉమ్మడిజిల్లాల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. శనివారం అనంతపురంలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధానకార్యదర్శి అశోక్ ఆనందరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరగ్గా ముజీబ్‌ఖాన్ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆయనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పేరూరులోని ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు రైతులు అభినందించారు. ఫర్టిలైజర్స్ షాపుల సమస్యల పరిష్కారానికి కోసంకృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ తక్ష ణమే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకు లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం జడ్పీ వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూల మాలలు వేశారు. టవర్ క్లాక్ వరకు ర్యాలీ కొనసాగించారు. అనంతరం స్థానిక ఎన్జీఓ హోంలో మాదిగల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మార్పీఎస్ఎస్ అధ్యక్షుడు బుంగా సంజయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ టీఎం రమేష్ మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టుకు కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణకు సహకరిస్తున్న సీఎం చంద్రబాబుతో పాటు ఇతర నాయకులకు ధన్య వాదాలు తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఉమేష్ దస్తగిరి, అధ్యక్షుడిగా చలపతి, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామన్న, యువసేన అధ్యక్షుడిగా అరవింద్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు: డీఎస్పీ

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అల్లర్లు, గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తాడిపత్రి డీఎస్పీ రామకృష్ణుడు హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామమైన ఆలూరు గ్రామంలో శనివారం సాయంత్రం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇరు వర్గాలతో మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగించే వారు ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఆయన వెంట రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

బ్రాహ్మణపల్లిలో నాకాబందీ

తాడిపత్రి మండలంలోని బ్రాహ్మణపల్లిలో శనివారం తెల్లవారుజామున రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లు, గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలన్నారు. ఎలాంటి గొడవలకు వెళ్లరాదని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువచ్చి సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

నాలుగు ఇసుక టిప్పర్ల సీజ్

పెద్దపప్పూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జోడిధర్మాపురం గ్రామం వద్ద ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు టిప్పర్లను శనివారం సీజ్‌చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్‌బాషా తెలిపారు. కర్నూలు జిల్లా డోన్‌కు అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడిచేసి నాలుగు ఇసుక టిప్పర్లను సీజ్‌చేశామని ఆయన తెలిపారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం: సీఐ

యాడికి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాల వాడడం వల్ల జీవితాలు నాశనమవుతాయని యాడికి యూపీఎస్ సీఐ ఈరన్న తెలిపారు. శనివారం మండలంలోని రాయలచెరువు హైస్కూల్‌లో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు, మత్తుపదార్థాలు వాడడం వలన జీవితాలు నాశనమవుతాయన్నారు. మత్తుపదార్థాలు వాడేవారు తీవ్ర అనారోగ్యపాలవుతారని, క్యాన్సర్ వంటి రోగాలకు గురికాక తప్పదన్నారు. వాటికి దూరంగా ఉండాలని చెప్పారు. సదస్సులో ప్రధానోపాధ్యాయుడు డేనియల్, సైన్స్ ఉపాధ్యాయురాలు ఇందిరారాణి, ఆరోగ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్ కేసు నమోదు

గుత్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఐరన్ మార్ట్‌లో రూ.20లక్షలు విలువ చేసే సామగ్రిని విక్రయించి మోసం చేసిన కేసులో యాడికికి చెందిన మంజునాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శ్రీనిధి ఐరన్ మార్ట్‌ను అనంతపురానికి చెందిన లక్ష్మీకాంత్‌రెడ్డి నిర్వహిస్తున్నాడు. సమీప బంధువైన మంజునాథ్‌రెడ్డిని గుమస్తాగా పెట్టి వ్యాపారం సాగించేవాడు. యజమాని లేని సమయంలో దాదాపు రూ. 20లక్షలు విలువ చేసే 26 టన్నుల ఐరన్‌ను విక్రయించేసి అందుకు లెక్కలు చెప్పకుండా మోసం చేయడమే కాకుండా దుకాణం వదిలివేశాడు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కారు బాడుగ విషయంలో ఘర్షణ

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన ధనుష్, సుబ్బు కారు బాడుగ విషయంలో మాటమాటపెరిగి ఘర్షణ పడ్డారని పట్టణ పోలీసులు తెలిపారు. గన్నెవారిపల్లి కాలనీ సుబ్బుకు చెందిన కారును సుంకులమ్మపాలెంకు చెందిన ధనుష్, సురేష్ బాడుగకు తీసుకువెళ్లారు. తిరిగి వచ్చిన తర్వాత బాడుగ అడుగగా ఇవ్వకపోవడంతో ఒకరికొకరు ఘర్షణపడి రాళ్లురువ్వుకున్నారు. వీటికి సంబంధించి పట్టణ సీఐ ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు అదృశ్యం

బెళుగుప్ప, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలో నక్కలపల్లికి చెందిన రైతు మల్లికార్జునరెడ్డి కనపడలేదని కుమారుడు నాగేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ బాల నరసింహులు తెలిపారు. ఐదు రోజుల క్రితం తోటలోకి వెళ్లి ఇంటికి రాలేదని, బంధువుల గ్రామాలలో వెతికినా కనిపించడం లేదని కుమారుడు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆసుపత్రికి ఆక్సిజన్ సిలిండర్ వితరణ

పామిడి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు భోగేశ్వరస్వామి దేవాలయ కమిటీ ఛైర్మన్ మురళిధర్‌గుప్తా శనివారం ఆక్సిజన్ సిలిండర్‌ను వితరణ చేశారు. సుమారు రూ. 20వేలు విలువ గల ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు వాటి పరికరాలను సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నారాయణమూర్తి, మండల అధ్యక్షుడు ఉపేంద్ర పాల్గొన్నారు.


ఆక్సిజన్ సిలిండర్ అందిస్తున్న మురళీధర్ గుప్తా

గుంతల రహిత రహదారులే లక్ష్యం: కాలవ

రాయదుర్గం/డి.హీరేహాళ్, నవంబరు2(ఆంధ్రజ్యోతి): గుంతల రహిత రహదారులే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు వెళుతున్నారని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రోడ్లలో గుంతలు పూడ్చే కార్యక్రమంలో భాగంలో శనివారం పట్టణంలోని ఒకటో వార్డులో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో గడిచిన ఐదేళ్ల కాలంలో పాడైపోయిన రోడ్లలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని ఎన్‌డీఏ ప్రభుత్వం చేపట్టిందన్నారు. వచ్చే సంక్రాంతి లోపు పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రశాంతి, గోవిందరాజులు, శ్రీనివాసరెడ్డి, నాయకులు టంకశాల హనుమంతు, పురుషోత్తం, తిప్పేస్వామి పాల్గొన్నారు. డి.హీరేహాళ్ మండలంలో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరంతరం మహిళా అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ఇందుకు నిదర్శనమే ఉచిత సిలెండర్ల పంపిణీ అని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బసవకుమార్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, గంగాధర, మల్లికార్జున, పుష్పావతి, శ్రీరాములు పాల్గొన్నారు.


రాయదుర్గం, గుంతకల్లులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, గుమ్మనూరు జయరాం

టీడీపీతోనే అభివృద్ధి: జయరాం

గుంతకల్లు : వైసీపీ హయాంలో చతికిలబడిన అభివృద్ధి చంద్రబాబు పాలనలో కార్యరూపం దాలుస్తోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కసాపురం రహదారిలో అయ్యప్పస్వామి దేవాలయం వద్ద ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 51 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతులకు ప్రభుత్వం రూ. 53 కోట్లు విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, ఆనంద్, కృష్ణారెడ్డి, వెంకటేశులు, మస్తానప్ప పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీక శోభ

తాడిపత్రి/బొమ్మనహాళ్/రాయదుర్గం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి పట్టణంలోని శివాలయాల్లో కార్తీకమాసం ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బుగ్గరామలింగేశ్వరస్వామి, భ్రమరాంబికామల్లికార్జునస్వామి ఆలయం, వేదమాతగాయత్రీ అమరలింగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం మొదటిరోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అదే విధంగా పట్టణంలోని ఏటిగడ్డ ఆంజనేయస్వామి ఆలయం, నందలపాడు, పుట్లూరురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లులో వెలసిన ఆంజనేయస్వామికి కార్తీకమాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున పంచామృతాభిషేకం, నిర్మాల్య విసర్జన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు, సంతోష్‌కుమార్‌చార్యులు, అన్నదాన కార్యక్రమ ఛైర్మన్ తిప్పేస్వామి, కార్యనిర్వాహణాధికారి నరసింహారెడ్డి పాల్గొన్నారు. రాయదుర్గం మండలంలోని వడ్రవన్నూరు సమీపంలో వెలసిన అప్పులాపురం ఆంజనేయస్వామి ఆలయం, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, వస్త్రాలంకరణ, వెండి కవచధారణ తదితరపూజలు నిర్వహించారు.

ప్రజాసమస్యలపై పోరాటం చేయండి

గుత్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటం చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు సావిత్రమ్మ పేర్కొన్నారు. గుత్తి పట్టణంలోని జడ్ వీరారెడ్డి భవనంలో శనివారం ఆ పార్టీ పదో మండల సభను నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అగ్రనేత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సావిత్రమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో సీపీఎం అభివృద్ధికి పాటుపడాలన్నారు. రైతులు, కూలీలు, మహిళల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు కొనసాగించాలన్నారు. ఇందు కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యలపై చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రామకృష్ణ, రేణుకా, మల్లికార్జున, రమేష్, మద్దిలేటి, రేవతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

బెళుగుప్ప, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండ్లపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి రవితేజ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాఘవేంద్ర శనివారం తెలిపారు. ఇటీవల అనంతపురం జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. హెచ్ఎం శేషగిరి, ఉపాధ్యాయులు నాగభూషణం, గిరిధర్ అభినందించారు.

క్రికెట్ పోటీలకు తాడిపత్రి వాసి..

తాడిపత్రి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 6నుంచి మంగళగిరిలో జరగనున్న అండర్-19 రాష్ట్రస్థాయి క్రికెట్ జట్టుకు తాడిపత్రి క్రీడాకారుడు జయంత్‌కృష్ణ ఎంపికైనట్లు ఆర్డీటీ ఏటీఎల్ లలిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన జయంత్‌కృష్ణను ఏటీఎల్‌తోపాటు కోచ్ సాదిక్ వలి, భార్గవ్ తదితరులు అభినందించారు.

వీఆర్‌ఏను తొలగించండి

విడపనకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉద్యోగం చేసినట్లు ఉద్యోగోన్నతి పొందిన వీఆర్‌ఏ లోకేష్‌పై తగిన చర్యలు తీసుకోవాలని మండల వీఆర్‌ఏలు శనివారం తహసీల్దార్ సునితాభాయికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ అనంతపురం నగరానికి చెందిన లోకేష్ విడపనకల్లు తహసీల్దారు కార్యాలయంలో ఒక్క రోజు కూడా విధులు నిర్వహించలేదన్నారు. ప్రతి నెలా ఇక్కడి నుంచే వేతనం ఇచ్చారని, దీనికి తోడు ఉద్యోగోన్నతి కల్పించారని తెలిపారు. 2011 వీఆర్‌ఏలుగా చేరి విధులు నిర్వహిస్తున్న స్థానికులను కాదని ఒక్కరోజు కూడా విధులకు హాజరుకాని లోకేష్‌కు ఉద్యోగోన్న ఎలా ఇస్తారని ప్రశ్నించారు. వీఆర్‌ఏ లోకేష్ ఉద్యోగంపై విడపనకల్లులో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఈరన్న, ఉపాధ్యక్షుడు నాగేష్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.





